## మలిదశ తెలంగాణ ఉద్యమానికి టీజేఎఫ్ దిక్సూచి

- రజతోత్సవ సభ పోస్టర్ విడుదల



మంచిర్యాల టౌన్ : పోస్టర్ విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

మంచిర్యాలటౌన్, మే 25 : మలిదశ తెలంగాణ ఉద్యమానికి టీజేఎఫ్ (తెలంగాణ జర్నలిస్టుల ఫోరం) దిక్సూచిగా నిలిచిందని టీజేఎఫ్, టీయూ డబ్ల్యూజే -143 జర్నలిస్ట్ యూనియన్ నాయకులు అన్నారు. టీజేఎఫ 25వ వసంతోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో గల జలవిహార్ వేదికగా 31న నిర్వహించే రజతోత్సవ సభ పోస్టర్‌ను మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద యూనియన్ నాయకులు, జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2001లో మలిదశ తెలంగాణ ఉద్య మం ప్రారంభమైన సంవత్సరంలోనే మొదటిసారిగా తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆవిర్భవించినట్లు తెలిపారు. ఆంధ్రా మీడియా పెత్తనం సాగుతున్న తరుణంలో, జర్నలిస్టులు తటస్థంగా ఉండాలన్న ఒత్తిళ్ల సమయంలో తెలంగాణ ప్రజలతో కలిసి నడిచేందుకు టీజేఎఫ్ ఆలోచన పుట్టినట్టు చెప్పారు. ఆంధ్రా యాజమాన్యంలో పనిచేస్తూనే తెలంగాణ జర్నలిస్టులు ఒకే తాటిపై నిలబడడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. రజతోత్సవ సభకు జిల్లాలలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాసరి ఉమేష్, రేణికుంట్ల శ్రీనివాస్, చెట్ల రమేశ్, అంబిలపు శ్రీనివాస్, సిద్ధార్థ్, కుమార్, శ్రీనివాస్, గుడికందుల రమేశ్, అబ్బు వజీర్ తదితరులు పాల్గొన్నారు.

## డిపాజిటర్లకు డబ్బు చెల్లించాలి



సమావేశమైన సహారా ఇండియా బాధితుల సంఘం

మందమర్రి, మే 25 : సహారా ఇండియాలో డబ్బు డిపాజిట్ చేసి కాల పరిమితి ముగిసినా సంస్థ నుంచి చెల్లింపులు జరుగలేదని, వెంటనే చెల్లించాలని డిపాజటర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మందమర్రి సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో సహారా ఇండియా బాధితుల సంఘం నాయకులు చిలుక సంజీవ్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సహారా ఇండియా డిపాజిటర్ల సూచనల మేరకు పలు తీర్మానాలు చేసినట్లు చిలుక సంజీవ్ తెలిపారు. కలెక్టర్, రామగుండం సీపీ, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను కలిసి వినతి పత్రాల అందజేత, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, డీ రాజమౌళి, కొమురయ్య, గంగారాం, రాజేందర్, రాంబాబు, మల్లయ్య, నోముల వెంకన్న, సత్యానారాయణ, అజారుద్దీన్, ఓదెలు, జిల్లా వ్యాప్తంగా పలువురు సహారా ఇండియా డిపాజిటర్లు పాల్గొన్నారు.

## బౌద్ధ ఉపాసకుడికి గ్రంథాల అందజేత



వాంకిడి : గులాబ్ ఉప్రేకు గ్రంథాలను అందజేస్తున్న నాయకులు

వాంకిడి, మే 25 : భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా కమిటీ తరఫున బ్రదర్స్ డే ను పురస్కరించుకొని ఆదివారం ఆసిఫాబాద్ లుంబిని దీక్ష భూమి మాజీ అధ్యక్షుడు గులాబ్ ఉప్రేకు అంబేద్కర్ గ్రంథాలను అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ ముహుల్కర్ మాట్లాడుతూ.. బ్రద ర్స్ డే అన్నదమ్ముల మధ్య ప్రేమానురాగాలను పెంపొందించేలా, ఆప్యాయతగా ఉండాలని అంబేద్కర్ గ్రంథాలను పఠణం చేసి, బంధుత్వాన్ని మరింత బలంగా నిలుపుకునేలా ముందుకు సాగాలన్నారు. కార్యదర్శి పెరుగు ఆత్మారాం, కోశాధికారి దుర్గం తిరుపతి, భారతీయ బౌద్ధ మహా సభ మండలాధ్యక్షుడు జయరాం ఉప్రే, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు శ్యామ్‌రావ్ దుర్గే, నాయకులు మున్నా పాల్గొన్నారు.

## వాహనదారులు నియమాలు పాటించాలి




అవగాహన కల్పిస్తున్న రామకృష్ణాపూర్-2 ఎస్ఐ లలిత

మందమర్రి రూరల్, మే 25 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రామకృష్ణపూర్-2 ఎస్ఐ లలిత సూచించారు. మండలంలోని గుడిపెల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులను కలిసి రోడ్డు భద్రతా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకయ్య, హెడ్ కానిస్టేబుళ్లు జంగు, అంకయ్య, రవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు

రెబ్బెన, మే 25 : సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు పేర్కొన్నారు. ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి 16 నెలలవుతున్నదని, ఏఐటీయూసీ హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు ఓజియార్, ఏరియా ఆర్గనైజర్ ఇనూస్, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐకి వినతి

భైంసా, మే 25 : భైంసాలోని పలువురు ఆదివారం పట్టణ ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముథోల్ మండలంలోని రాళ్లబోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని లేదంటే రిలే నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు. ఇక్కడ దేవీదాస్ హస్డే, అశోక్ చంద్రే, లక్ష్మణ్, రాజారాం, రాములు, గంగాధర్ ఉన్నారు.



సీసీసీ నస్పూర్‌లో శిశుమందిర్ పూర్వ విద్యార్థులు



నస్పూర్ : అభినవ విద్యా సాధన పూర్వ విద్యార్థులు

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ఘనంగా అ'పూర్వ' సమ్మేళనాలు
- ఏండ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- గుర్తుచేసుకున్న చిన్ననాటి జ్ఞాపకాలు
- విద్యనేర్పిన గురువులకు సన్మానాలు



కోటపల్లి ప్రభుత్వ పాఠశాల 1983-84 బ్యాచ్ విద్యార్థులు

కోటపల్లి, మే 25 : కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 41 ఏండ్ల తర్వాత ఒక్కచోట చేరారు. ఆదివారం అదే పాఠశాలలో అ'పూర్వ' సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. గత స్మృతులను పంచుకొని ఆనందంగా గడిపారు. ప్రస్తుతం ఒక్కొక్కరు ఒక్కో రంగంలో కొలువుదీరగా, వారి కుటుంబాలతో వచ్చి పాఠశాలలో సందడి చేశారు. పాఠాలు బోధించిన గురువులకు సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొట్టె నారాయణ, వారణాసి నాగేందర్, కొట్టె శంకర్, కోమట్ల బాపు, రమణారావు, పుట్ట సత్తయ్య, వంగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**సీసీసీ నస్పూర్ శారద శిశుమందిర్‌లో..**

సీసీసీ నస్పూర్, మే 25 : సీసీసీ నస్పూర్ శారద శిశుమందిర్ పాఠశాల 2006-07 బ్యాచ్ విద్యార్థులు అ'పూర్వ' సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు తమ బాగోగులు అడిగితెలుసుకొని, రోజంతా ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. పాఠాలు బోధించిన గురువులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వొడ్నాల సత్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, కూసి తిరుపతి, మైదం రామకృష్ణ, పూట్ల రాజనందం, రాజు, రవీందర్, పింగిలి సంపత్‌రెడ్డి, నర్సింగం, ఉదయ్, మల్లేశ్, పెర్క సత్తయ్య, లక్ష్మణ్, సమ్మేళనం ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సతీశ్, రాంబాబు, లావణ్య, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

**అభినవ విద్యా సాధన పాఠశాలలో..**

నస్పూర్, మే 25 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అభినవ విద్యా సాధన పాఠశాల 2002-02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**నీల్వాయి ప్రభుత్వ పాఠశాలలో..**


వేమనపల్లి, మే 25 : నీల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2006-07 పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మొగిలి, శిరీష్, గీత, మధు, లక్ష్మీనివాస్, రాజు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యాభారతి స్కూల్‌లో..**

తాండూర్, మే 25 : తాండూర్ విద్యాభారతి పాఠశాల 2007-2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మండల కేంద్రంలోని సురభి ఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒకే వేదికపై చేరి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కరస్పాండెంట్ సురభి ఆగమరావు మాట్లాడుతూ.. పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



వేమనపల్లి : నీల్వాయి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



తాండూర్ : గురువులతో విద్యాభారతి పూర్వ విద్యార్థులు

## బురదమయం.. లంబాడీ తండా రోడ్డు

**దహెగాం మండలం** కల్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని లంబాడీ తండాలకు వెళ్లే రోడ్డు చిత్తడిగా మారింది. చిన్నపాటి వర్షానికే అధ్వానంగా తయారవుతున్నది. ప్రస్తుతం కురుస్తున్న అడపాదడపా వానలకే రోడ్డు బురదమయమైంది. కిలోమీటర్ మేరా ఇదే పరిస్థితి ఉండడంతో తండాలకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం మొదలవకముందే పరిస్థితి ఇలా ఉందంటే మున్ముందు ఎలా ఉంటుందోనని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

- దహెగాం, మే 25



చిత్తడిగా మారిన కల్వాడ లంబాడీ తండా రోడ్డు

## మిషన్ భగీరథ నిర్వహణ అస్తవ్యస్తం



కొత్తపల్లిలో నిరుపయోగంగా మంచినీటి ట్యాంక్

తాండూర్, మే 25 : తాండూర్ మండలంలో మిషన్ భగీరథ తాగు నీటి పథకం నిర్వహణ కొంతకాలంగా అస్తవ్యస్తంగా తయారైంది. అధికారుల పట్టింపులేనితనంతో గ్రామాల్లో నీటి సరఫరా లోపభూయిష్టంగా ఉండడం, పైపు లైన్లు, గేట్ వాల్వ్ వద్ద లీకేజీలతో తాగునీరు వృథాగా పారడంతోపాటు, కలుషితమవుతున్నది. మండల కేంద్రంలోని మాదారం పోలీస్‌స్టేషన్ ఎదుట మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకేజీ ఏర్పడి నెలలు గడుస్తున్నది. దీంతో గేట్‌వాల్వ్ వద్ద మురుగు నీటి నిల్వ ఏర్పడింది. తాగునీరు ప్రధాన రహదారి మీదగా పారుతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కిష్టంపేట జీపీ పరిధిలోని 5వ వార్డులో ఇటీవలే నాలా నిర్మాణం కోసం గుంతలు తీయగా, గతంలో వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ బయటపడింది. ప్రస్తుతం నిర్మాణానికి తీసిన గుంతలు పూడుకుపోయాయి. పైప్‌లైన్ అందులోనే ఉండిపోయింది. రాజీవ్‌నగర్ జీపీ పరిధిలోని 8వ వార్డులో రహదారికి అడ్డుగా మిషన్ భగీరథ వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి బోయపల్లిబోర్డు, బోయపల్లి వరకు మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ గేట్ వాల్వ్ లీకై తాగునీటి వృథాతోపాటు, కలుషితమవుతున్నది. సమస్యను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. కొత్తపల్లిలో మిష న్ భగీరథ పథకం నిర్వహణ గ్రామపంచాయతీకి అప్పగించగా, అధికారుల నిర్ల క్ష్యం, నిర్వహణలో లోపాలతో ట్యాంక్ నిరుపయోగంగా మారింది. భూ దానం చేసిన వ్యక్తి తన సమస్యలు పరిష్కరించాలని కొన్ని నెలలుగా ట్యాంక్ సమీపంలోకి అధికారులను రానీయకుండా, నీరు నింపకుండా అడ్డుకుంటున్నాడు. అధికారులు తమ పనిని శ్రద్ధగా చేయకపోవడం వల్లే మిషన్ భగీరథ పథకం సక్రమంగా అమలకావడం లేదని ఆరోపిస్తున్నారు.

## రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

వేమనపల్లి, మే 25 : నీల్వాయి గ్రామంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదివారం బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మండలాధ్యక్షుడు ఏట మధూకర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన డబుల్ రోడ్డు పనులు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల పూర్తి కావడం లేదన్నారు. గతంలో నిరసన చేపట్టడంతో గుత్తేదారు కొత్తగూడెం నుంచి నీల్వాయి వరకు రోడ్డు పూర్తి చేశాడని పేర్కొన్నారు. నీల్వాయి గ్రామంలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, సింగిల్‌గా నిర్మిస్తున్నారని తెలిపారు. అందుకు రోడ్డును తీసి ఎర్రమట్టి పోయడంతో వర్షపు నీరు చేరి బురదమయంగా మారిందని, వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు చరణ్‌రాజ్, స్వామి, రమేశ్‌గౌడ్, ప్రశాంత్, పోచయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

## కూల్ కూల్ స్విమ్మింగ్

- వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారుల తాకిడి
- ఉదయం, సాయంత్రం ఫుల్‌గా స్విమ్మింగ్ పూల్



చిల్డ్రన్స్ స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారుల సందడి



పెద్దల స్విమ్మింగ్ పూల్‌లో..

సీసీసీ నస్పూర్, మే 25 : కోల్‌బెల్ట్ ప్రాంతమైన సీసీసీలోని సింగరేణి స్విమ్మింగ్‌పూల్ పిల్లలు, పెద్దలతో కిటకిటలాడుతున్నది. వేసవి సెలవుల నేపథ్యంలో తాకిడి పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో పూల్ అంతా నిండిపోతున్నది. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ స్విమ్మింగ్ పూల్ సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఇక్కడ పెద్దలు, పిల్లలు వేర్వేరుగా స్విమ్మింగ్ చేసేందుకు యాజమాన్యం రెండు ఈత కొలనులు నిర్మించింది. చిన్నపిల్లలు నీటిలో మునిగిపోకుండా తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయగా, స్విమ్మింగ్ వచ్చిన వారు పెద్ద కొలనులో స్విమ్ చేస్తారు. కోచ్ పర్యవేక్షణలోనే ఇదంతా కొనసాగుతున్నది. సింగరేణి ఉద్యోగులకు రూ.100, వారి పిల్లలకు రూ.70 నెలవారీగా ఫీజు తీసుకుంటున్నారు. వివిధ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే వారికి రూ.200, బయటివారికి రూ.500 ఫీజు తీసుకుంటున్నారు. ఈ వేసవిలో స్విమ్మింగ్ చేసేందుకు మొత్తం 400 మంది యాజమాన్యం నుంచి పాస్‌లు తీసుకోగా, ఇందులో ఉదయం, సాయంత్రం కలిపి మొత్తం 200మంది వరకు స్విమ్మింగ్ చేసేందుకు వస్తున్నారు. అయితే శ్రీరాంపూర్ ఏరియాలో 9 వేల పైచిలుకు మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, ఒక్కటే స్విమ్మింగ్ పూల్ ఉండడం ఇబ్బందిగా మారింది. తాకిడి ఎక్కువగా ఉండడంతో శ్రీరాంపూర్‌లో మరోటి నిర్మించాలన్న డిమాండ్ ఉన్నా సాధ్యం కావడంలేదు.

## రైలు ఢీకొని ఒకరి మృతి

మంచిర్యాల అర్బన్, మే 25 : రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు మంచిర్యాల జీఆర్పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల రవీంద్రఖని ఏరియాలో ప్రమాదం జరిగిందని, మృతి చెందిన యువకుడికి 30 నుంచి 35 ఏళ్లు ఉంటాని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదని వెల్లడించారు. తన కుడిచేతిపై కరుణసాయి అని పచ్చబొట్టు ఉన్నట్లు, మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపర్చినట్లు వివరించారు. వివరాల కోసం 87126 58596, 83285 12176 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## బావిలో పడి మహిళ మృతి

సిర్పూర్(యూ), మే 25 : వ్యవసాయ బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన ధనోరా తండా సమీపంలో చోటు చేసుకున్నది. జైనూర్ సీఐ రమేశ్, ఏఎస్ఐ ఎన్ గంగారాం ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్ మండలం గుంనూర్ గ్రామానికి చెందిన కనక జారుబాయి (58) గత గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు మూడు రోజులుగా ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా, ఆదివారం ధనోరా గ్రామానికి చెందిన కొందరు వ్యవసాయ బావిలో మహిళ మృతదేహాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బృందం సంఘనా స్థలానికి వెళ్లి పరిశీలించింది. మృతురాలికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో పాటు, మతిస్థిమితం సరిగా ఉండేది కాదని, అనుకోకుండా బావిలో పడి ఉంటుందని, లేదా ఆత్మహత్య చేసుకొని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా భర్త కనక జంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులో పడి విద్యార్థి..



హేమంత్ (ఫైల్)

కాగజ్‌నగర్, మే 25 : కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన హేమంత్ (16) పెద్దవాగు జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులో పడి మృతి చెందినట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీ ప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తన మి త్రులతో కలిసి ఆడుకునేందుకు స మీపంలోని ప్రభుత్వ పాఠశాల వద్దకు వెళ్లారు. అనంతరం హేమంత్ అక్కడి నుంచి స్నానం చేసేందుకు జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఆదివారం మృతదేహం తేలినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి చరణ్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చెన్నూర్ రూరల్, మే 25 : చెన్నూర్ మండలం ముత్తరావుపల్లిలో ముకుం రాజేందర్‌కు చెందిన ఎద్దు ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. సమీపంలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా, ఎర్త్ వైర్ తగిలి అక్కడికక్కడే చనిపోయింది. సంఘటనా స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. వ్యవసాయ పనులు చేసుకునే తన ఎద్దు మృతితో వీధిన పడినట్లయిందని, అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

## 28న చెన్నూర్‌లో సదస్సు

చెన్నూర్, మే 25 : మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ చెన్నూర్‌లోని పద్మశాలీ భవన్‌లో ఈ నెల 28న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కే విశ్వనాథ్ తెలిపారు. చెన్నూర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టు నాయకుడు నంబళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోచమల్లు, మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ఆదుకోవాలి

హాజీపూర్, మే 5 : చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ హాజీపూర్ మండలాధ్యక్షుడు స్వామి రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నర్సింగాపూర్‌లో గల చేనేత కార్మికులను కలిసి శాలువాతో సన్మానించారు. చేనేత కార్మికులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మార్కెట్‌లో వస్త్ర పరిశ్రమకు ఎంతో డిమాండ్ ఉన్నా ఆకలితో అలమటిస్తున్నారని, లక్షల పెట్టుబడి పెట్టి సాంచాలు కొనుగోలు చేసి కనీస ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. నేత కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని, తక్షణమే చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలన్నారు. సెంట్రల్ ఫిలిం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యులు మోటపలుకుల తిరుపతి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు వెంకట రమణారావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డితో పాటు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ల అప్పగింత

కాగజ్‌నగర్, మే 25 : కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సాంబయ్య, సయ్యద్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ఆదివారం కాగజ్‌నగర్ పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ అప్పగించారు. సదరు వ్యక్తులు ఇటీవల తమ ఫోన్లు పోగొట్టుకోగా, సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకున్నారు. ఆ మొబైల్ ఫోన్లు ట్రేస్ చేసి పట్టుకొని అప్పగించినట్లు ఆయన స్పష్టం చేశారు. కానిస్టేబుల్ జ్యోత్స్న, వరలక్ష్మి సహకారంతో పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు.

## రైతుల ఖాతాల్లో రూ.186 కోట్లు జమ

నస్పూర్, మే 23 : మంచిర్యాల జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.186.13 కోట్లు జమ చేసినట్లు అదనపు కలెక్టర్ మోతీలాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 320 కేంద్రాల ద్వారా 21,253 మంది రైతుల వద్ద నుంచి 1,53,275 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

## సంస్కృతీసంప్రదాయాలు కాపాడుకోవాలి

ఉట్నూర్ రూరల్, మే 25 : బంజారా సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలని బంజారా సమాజ్ పెద్దలు, నాయకులు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని పెర్కగూడ గ్రామ సమీపంలో జేసీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లాలకు చెందిన 9 డోక్రా(ముసలి) లోలావత్, గుగ్లావత్, జాదవ్, మేనపాలకి, సదర్ నాయక్ పరిచయ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న బంజారా సంస్కృతిని కాపాడుకోవాలని అన్నారు. అందుకు నేటి యువత సంస్కృతీ సంప్రదాయాలపై చర్చిస్తూ ఉండాలని సూచించారు. బంజారా భవిష్యత్ నేటి తరంపై ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో బంజారా పెద్దలు, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.